



# కరపత్రం

SINCE 2014

మంగళవారం మార్చి 31, 2026 | సంపుటి : 2 | సంచిక : 169 | - శివప్రసాద్, మేనేజింగ్ ఎడిటర్ | పేజీలు :4




## ఆహార కల్తీ నియంత్రణ
# సరికొత్త వ్యవస్థ

- ఈగల్, హైడ్రా తరహాలో ఏర్పాటు ఆలోచన
- నిత్యావసరాలు అక్రమ నిల్వ చేస్తే కఠిన చర్యలు
- సన్నబియ్యం పంపిణీతో బ్లాక్ మార్కెట్ తగ్గింది
- వాణిజ్య పంటలవైపు రైతులను ప్రోత్సహిస్తున్నాం
- త్వరలోనే ప్రజలకు క్యాన్సర్ టెస్టుల నిర్వహణ
- 50 శాతం సీట్లు పెంపు వెనక పెద్ద కుట్ర
- దక్షిణభారతదేశానికి తీవ్ర అన్యాయం చేసే ఎత్తుగడ
- దీనికోసం బిజెపి లక్ష్మణ రాజీనామా చేయాలి
- కెసిఆర్ వల్లనే తనకు మంచి పేరు వస్తోంది
- మీడియా చిట్‌చాట్‌లో సిఎం రేవంత్ రెడ్డి

**హైదరాబాద్,మార్చి30 :**
ఈగల్, హైడ్రా తరహాలో ఆహార కల్తీ నియంత్రణకు సరికొత్త వ్యవస్థను తీసుకొస్తామని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. దేశంలో చట్టాలను అధ్యయనం చేసి పకడ్బందీ వ్యవస్థను రూపొందిస్తామన్నారు. మరోవైపు పంటకు ధర నిర్ణయించే అవకాశం రైతుకు లేకుండా పోయిందని, వారి అవసరాలను ఆసరాగా చేసుకొని దళారులు దోపిడీ చేస్తున్నారని సీఎం వ్యాఖ్యానించారు. రైతుల హక్కులను కాపాడేందుకు కనీస మద్దతు ధర చట్టం తీసుకొచ్చినట్లు గుర్తు చేశారు. సోమవారం ఆయన మీడియాతో చిట్‌చాట్‌గా మాట్లాడారు. నిత్యావసరాలను అక్రమంగా నిల్వ ఉంచడం హత్యానేరం కంటే ఎక్కువే. ప్రజలకు దొడ్డుబియ్యం ఇవ్వడం వల్ల ప్రయోజనం లేదని గ్రహించాం. 86 శాతం ప్రజలు సన్నబియ్యం పొందుతున్నారు. అర్హులందరికీ రేషన్‌కార్డు ఇచ్చాం. రైతులకు లాభం చేకూర్చడమే కాదు..పేదల ఆకలి తీరుస్తున్నాం. సన్నబియ్యం పంపిణీతో బ్లాక్ మార్కెట్ మాఫియా తగ్గింది. వాణిజ్య పంటలవైపు రైతులను ప్రోత్సహిస్తున్నాం అని అన్నారు.పంట మార్పిడి విషయంలో రైతులపై ఒత్తిడి తీసుకురామని.. వారికి అవగాహన కల్పిస్తామని తెలిపారు. పేదలకు ఇచ్చే సన్న బియ్యం కోసం రూ.14,560 కోట్లు ఖర్చు పెడుతున్నామని, దాంట్లో కోతలు పెట్టమని స్పష్టం చేశారు. సన్న బియ్యం పక్కదారి పట్టడం లేదని తెలిపారు. మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సన్న బియ్యంతో అసెంబ్లీలో అందరికీ మంచి భోజనం పెట్టారన్నారు. పేదలందరికీ ప్రభుత్వ పథకాలు కచ్చితంగా అందుతాయని పేర్కొన్నారు ముఖ్యమంత్రి. వరి వేస్తే ఉరే అని కేసీఆర్ అన్నారని.. తాము మాత్రం వరి వేస్తే బోనస్ ఇస్తున్నామని ధీమా వ్యక్తం చేశారు. నియోజకవర్గాల పునర్వ్యవస్థీకరణలో భాగంగా 50 శాతం సీట్లు పెంచితే.. దక్షిణభారతదేశానికి తీవ్ర అన్యాయం జరుగుతుందని పునరుద్ఘాటించారు. దక్షిణాదిపై ఉత్తరాది ఆధిపత్యం చెలాయిస్తుంది. దక్షిణాదిలో ఒక్క సీటు రాకున్నా కేంద్రంలో సర్కారు ఏర్పాటు చేసుకోవచ్చు. రాష్ట్రాల సీట్ల మధ్య అంతరం.. పెంచిన తర్వాత కూడా అంతే ఉండాలి. నియోజకవర్గాల పునర్వ్యవస్థీకరణ పార్టీల సమస్య కాదు. 50శాతం సీట్ల పెంపుపై విస్తృతంగా చర్చ జరగాలన్నారు. పార్టీలకు అతీతంగా దక్షిణాదిలో కార్యాచరణ ఉండాలి. దేశంలో నియంత పాలన రాకూడదన్నదే నా ఉద్దేశం. దక్షిణాదికి బలం లేదని పెత్తనం చేస్తామంటే.. అది ఎంతకాలమో కొనసాగదు. జాతీయ పార్టీ అయినా, అన్యాయంపై మాట్లాడే స్వేచ్ఛ మాకుందని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. దేశంలో నియోజకవర్గాల పునర్విభజనపై బీజేపీ ఎంపీ లక్ష్మణ్ ఏదేదో మాట్లాడుతున్నారని..

## ముంచుకొస్తున్న
# మంచినీటి సమస్య !

- కోటి ఎకరాల భూ ఆక్రమణకు టెండర్
- ముఖ్యమంత్రి, మంత్రుల భూ దందాకు సామాన్యుల బలి
- వట్టినాగులపల్లిలో బాధితులకు కెటిఆర్ పరామర్శ
- అండగా ఉంటామని హామీ


మిగతాది 2లో

**హైదరాబాద్,మార్చి30 :**
సీఎం రేవంత్ రెడ్డి పలుకుబడిని అడ్డుపెట్టుకుని అడ్డగోలుగా భూములు గుంజుకుంటున్నారని కేటీఆర్ విమర్శించారు. భూమి బౌండరీలను మార్చే ప్రయత్నం చేశారని ఆరోపించారు. మహేశ్వరం నియోజకవర్గంలో వేల ఎకరాలు కబ్జా చేస్తున్నారని తెలిపారు. అధికారులను అడ్డుపెట్టుకుని అరాచకపర్వం చేపడుతున్నారని మండిపడ్డారు.



2లో..

# హైదరాబాద్,చెన్నైని మించి
# అమరావతి అభివృద్ధి

- యువత రాజకీయాల్లోకి రావాలి...టిడిపి అవకాశం ఇస్తుంది
- పేదల సొంతింటి కలను సాకారం చేయడమే లక్ష్యం
- సూల్లూరుపేటలో టిడ్కో ఇళ్లను పంపిణీ
- రాష్ట్రవ్యాప్తంగా 2,50,893 మందికి సొంతిల్లు
- ఇండ్ల పండగ జరుగుతోందన్న సిఎం చంద్రబాబు
- గత వైసిపిది పనికిమాలిన ప్రభుత్వం అంటూ విమర్శలు

**తిరుపతి,మార్చి30 :**
రాజధాని అమరావతిని హైదరాబాద్, చెన్నై కంటే గొప్పగా తయారు చేసే బాధ్యత మేము తీసుకుంటాం అని సిఎం చంద్రబాబు అన్నారు. యువతకు ఇదే ఆహ్వానం. టీడీపీలోకి వస్తే అవకాశాలు కల్పిస్తాం అన్నారు. యువత రాజకీయాల్లోకి రావాలన్నారు. వైసీపీలాంటి పనికిమాలిన ప్రభుత్వాన్ని ఎప్పుడూ చూడలేదు. ప్రజలకు కోపం రావడం వల్లే వైసీపీని 11 సీట్లకు పరిమితం చేశారని అన్నారు. సూళ్లూరుపేట నియోజకవర్గం నాయుడుపేట వేదికగా 2.50 లక్షల ఇళ్లను లబ్దిదారులకు సీఎం నారా చంద్రబాబు నాయుడు పంపిణీ చేశారు. 2,50,893 పేద కుటుంబాలకు ఇళ్లను పంపిణీ చేసి వారితో గృహ ప్రవేశం చేయించారు.



## అక్రమాల పొంగులేటిని బర్తరఫ్ చేయాల్సిందే

- హౌజ్‌కమిటీ వేసి విచారణ జరపాల్సిందే
- శాసనమండలి ప్రతిపక్ష నేత మధుసూదనాచారి

**హైదరాబాద్,మార్చి30 :**
రాజ్యాంగం మీద ప్రమాణం చేసి ప్రజల ప్రాణాలకు రక్షణ కల్పించాల్సిన మంత్రి పొంగులేటి అవినీతి ఒక్కొక్కటిగా బయటపడుతున్నాయని శాసనమండలి ప్రతిపక్ష నేత మధుసూదనాచారి అన్నారు.

2లో..

## ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం నెరవేర్చాలి: విజయశాంతి



**హైదరాబాద్:**
కాంగ్రెస్ ఎమ్మెల్సీ విజయశాంతి కీలక వ్యాఖ్యలు చేశారు. తెలంగాణ ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం నెరవేర్చాలని డిమాండ్ చేశారు.“ అమరవీరుల కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం, అమరవీరుల కుటుంబాలకు నెలకు రూ.25వేల పింఛన్ ఇస్తామని చెప్పాం. ఉద్యమకారులపై కేసులు ఎత్తేసి.. ప్రభుత్వ గుర్తింపు కార్డు ఇస్తామని చెప్పాం. అధికారంలోకి వచ్చి రెండేళ్లయినా.. ఉద్యమకారులకు న్యాయం జరగలేదు. ఇచ్చిన హామీలు నెరవేర్చాలని ఉద్యమకారులు అడుగుతున్నారు. వారికిచ్చిన వాగ్దానాలు నెరవేర్చాలి” అని విజయశాంతి డిమాండ్ చేశారు.

# జీవో 317ను
# వెంటనే రద్దు చేయాలి

» వన్‌టైం రిలీఫ్ కింద స్వస్థలాలకు ట్రాన్స్‌ఫర్ చేయాలి
» గతంలో పిసిసి చీఫ్‌గా ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలి
» సిఎం రేవంత్ రెడ్డికి కల్వకుంట్ల కవిత బహిరంగ లేఖ



**హైదరాబాద్,మార్చి30 :**
జీవో నం.317 బాధితులకు వన్‌టైం రిలీఫ్ కింద స్వస్థలాలకు ట్రాన్స్‌ఫర్ చేయాలని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కవిత బహిరంగ లేఖ రాశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం 2021 డిసెంబర్ 6న జారీ చేసిన జీవో నం.317 వల్ల వేలాది మంది ఉద్యోగులు, ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని లేఖలో పేర్కొన్నారు. జీవో 317ను వెంటనే రద్దు చేసి ఉద్యోగులకు సొంత జిల్లాల్లో పోస్టింగ్స్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. పీసీసీ అధ్యక్షుడిగా ఉన్నప్పుడు సీఎం రేవంత్ రెడ్డి కూడా ఈ అంశంపై అప్పటి సీఎం కేసీఆర్ లేఖ రాసిన విషయాన్ని కవిత గుర్తు చేశారు. 2023 అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ.. జీవో 317ను సమీక్షించి బాధితులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చిందన్నారు. ఎన్నికల మేనిఫెస్టోలో కూడా ఈ విషయాన్ని కాంగ్రెస్ స్పష్టంగా పొందుపరిచినట్లు కవిత పేర్కొన్నారు.

మిగతాద్ది 2 లో


మిగతాది 2లో

## ద్రవ్యవినిమయ బిల్లుపై చర్చ..
## మహేశ్వర్‌రెడ్డి వ్యాఖ్యలపై అభ్యంతరం

**హైదరాబాద్:**
ద్రవ్యవినిమయ బిల్లుపై చర్చ సందర్భంగా తెలంగాణ శాసనసభలో గందరగోళం తలెత్తింది. భాజపా శాసనసభాపక్షనేత మహేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ..


మిగతాది 2లో

# పొంగులేటిని బర్తరఫ్ చేయండి

- గవర్నర్‌కు బిఆర్ఎస్ విజ్ఞప్తి

**హైదరాబాద్,మార్చి30**
ప్రతిపక్షాన్ని సీఎం రేవంత్‌రెడ్డి బెదిరించే ప్రయత్నం చేస్తున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. రాఘవ కన్‌స్ట్రక్షన్స్ అంశంలో సభా సంఘం వేయాలని కోరితే సీఐడీని అడ్డుపెట్టుకుని మంత్రి పొంగులేటిని రక్షించే ప్రయత్నం చేస్తున్నారన్నారు. పార్టీ నేతలతో కలిసి లోక్‌భవన్‌లో గవర్నర్ శివప్రతాప్ శుక్లాను కేటీఆర్ కలిశారు. ఈ సందర్భంగా పొంగులేటిపై ఫిర్యాదు చేశారు. ప్రభుత్వ పెద్దలే గద్దలుగా మారి అవినీతికి పాల్పడుతున్నారని కేటీఆర్ విమర్శించారు.

## ముంచుకొస్తున్న మంచినీటి సమస్య !

మొదటిపేజీ తరువాయి
కోటి ఎకరాల భూమిని నిషేధిత జాబితాలో పెట్టారని అన్నారు. రంగారెడ్డి జిల్లా వట్టినాగులపల్లిలో కేటీఆర్ సహా, బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు పర్యటించారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి భూ కబ్జా బాధితులను పరామర్శించారు. భూ కబ్జాలకు వ్యతిరేకంగా బీఆర్ఎస్ పోరాడుతుందని బాధితులకు భరోసానిచ్చారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. వట్టనాగులపల్లిలో సతీశ్ షా కుటుంబం 60 ఏళ్లుగా ఉంటుందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తెలిపారు. రూ.1400 కోట్ల విలువ చేసే భూమిపై పొంగులేటి కన్ను పడిందని పేర్కొన్నారు. స్థలం ఇచ్చే ఉద్దేశం లేదని షా కుటుంబం తెలిపిందని అన్నారు. ఔటర్ రింగ్ రోడ్డులో మీ ల్యాండ్ పోయిందని బెదిరింపులకు గురి చేశారని చెప్పారు. ఓ అక్రమార్కున్ని అడ్డం పెట్టుకుని 27 ఎకరాల భూమిని గుంజుకునే ప్రయత్నం చేశారని మండిపడ్డారు. జేసీబీలతో వచ్చి గోశాలను కూల్చేశారని.. కాంపౌండ్ వాల్ కూలగొట్టారని అన్నారు. సతీశ్ షాను ఇక్కడే సజీవంగా పాతిపెడతామని బెదిరించారని తెలిపారు. అజీబుల్లా ఖాన్ అనే సిన్సియర్ అధికారి వీరికి రక్షణ కల్పించారని పేర్కొన్నారు. తెల్లారే ఆ నిజాయితీ పోలీసు అధికారిని ట్రాన్స్‌ఫర్ చేశారని చెప్పారు. దశాబ్దాలుగా ఇక్కడే ఉంటున్నామని వట్టినాగులపల్లి బాధితుడు సతీశ్ షా తెలిపారు. 1968 నుంచి భూములను సాగు చేసుకుంటున్నామని పేర్కొన్నారు. పొంగులేటి హర్ష రెడ్డి వచ్చి రోడ్డుకు స్థలం ఇవ్వాలని అడిగాడని చెప్పారు. అందుకు నిరాకరించడంతో కొన్ని రోజుల తర్వాత శ్రీనివాస్ రెడ్డి వచ్చారని తెలిపారు. ఒక్క నోటీసు కూడా ఇవ్వకుండా మా భూమి సర్వే చేయించాడని అన్నారు. సర్వే నోటీసులను హైకోర్టు కూడా కొట్టివేసిందని పేర్కొన్నారు. మా మనుషులపై దాడులు చేసి గూండాలు బెదిరించారని తెలిపారు. హైకోర్టుకు వెళ్తే పోలీస్ ప్రొటెక్షన్ ఇవ్వాలని ఆదేశించిందని తెలిపారు.దీపావళి పండుగ తర్వాత నుంచి చాలా ఆందోళనగా ఉన్నామని వట్టినాగులపల్లి బాధితురాలు పల్లవి షా తెలిపారు. మా భూమి ఇవ్వాలని పొంగులేటి మనుషులు కోరినా నిరాకరించామని పేర్కొన్నారు. మేం 50 ఏళ్లుగా ఇక్కడే ఉంటున్నాం.. మాకు వేరే జాగా వద్దని అన్నామని చెప్పారు. అక్కడిస్తాం.. ఇక్కడిస్తామని మమ్మల్ని ఎంతో మభ్యపెట్టారని తెలిపారు. కిలోమీటర్ ఉన్న కాంపౌండ్ వాల్‌ను రాత్రికి రాత్రే కూల్చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేశామని తెలిపారు. అదే రోజు రాత్రి 70 మంది గూండాలు వచ్చి మా గార్డులను బంధించారని వాపోయారు. మొబైల్స్ గుంజుకున్నారు..
తెల్లవారుజాము వరకు నిర్బంధించారని తెలిపారు. ఇక్కడి నుంచి వెళ్లకపోతే నరికిపారేస్తామని బెదిరించారని అన్నారు. మాకు అండగా ఉన్న పోలీసు అధికారిని ట్రాన్స్‌ఫర్ చేయించారని తెలిపారు. మాకు అనుకూలంగా హైకోర్టు ఆదేశాలు ఉన్నా కూడా విధ్వంసానికి పాల్పడ్డారని తెలిపారు.

## అక్రమాల పొంగులేటిని బర్తరఫ్ చేయాల్సిందే

మొదటిపేజీ తరువాయి
ప్రభుత్వానికి కట్టాల్సిన డబ్బులు కట్టకుండా, ఎలాంటి అనుమతులు లేకుండా రాఘవ కన్‌స్ట్రక్షన్స్ కంపెనీ మైనింగ్ అక్రమాలకు పాల్పడిందని ఆయన ఆరోపించారు. ఈ మేరకు మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిపై మధుసూదనాచారి తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. సోమవారం ఉదయం గన్‌పార్క్ వద్ద మీడియాతో మాట్లాడుతూ.. మంత్రి పొంగులేటి అవినీతి మొత్తం సాక్ష్యాలతో సహా హరీశ్ రావు బయటపెట్టారని ఆయన తెలిపారు. ఈ ప్రభుత్వం దుర్మార్గ వైఖరితో బీఆర్ఎస్ శాసనసభ్యులను సస్పెండ్ చేసిందని మధుసూదనాచారి మండిపడ్డారు. ప్రభుత్వ ఆస్తులను కాజేస్తూ అక్రమాలకు పాల్పడుతున్న పొంగులేటిని వెంటనే బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. స్వయంగా సీఎం కూడా ఈ అక్రమాల్లో భాగస్వామ్యంగా ఉన్నారని ఆరోపించారు. పొంగులేటిని తక్షణమే బర్తరఫ్ చేయాలని శాసన మండలిలో డిమాండ్ చేస్తామని తెలిపారు. ఈ ప్రభుత్వం రాజశేఖర్ రెడ్డిని ఆదర్శంగా తీసుకుంటున్నామని పదే పదే చెబుతోందని.. కానీ ఓబులాపురం మైనింగ్ కేసులో అక్రమాలు జరిగాయని చెప్పడంతో నాగం జనార్ధన్ రెడ్డితో సభా సంఘం వేశారని గుర్తు చేశారు. అదే విధంగా పొంగులేటి అక్రమాలపై కూడా సభా సంఘం వేయాలని మధుసూదనాచారి డిమాండ్ చేశారు. ఉదయం గన్‌పార్క్ వద్దకు చేరుకున్న బీఆర్ఎస్ శాసనమండలి సభ్యులు.. కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్లకార్డుల ప్రదర్శిస్తూ నిరసన తెలిపారు. మంత్రుల అవినీతిపై హైకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరపించాలని డిమాండ్ చేశారు. అక్రమ మైనింగ్‌కు పాల్పడిన మంత్రి పొంగలేటి శ్రీనివాస్ రెడ్డిని వెంటనే బర్తరఫ్ చేయాలంటూ ప్లకార్డులతో బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు నిరసన తెలిపారు. వాణి దేవి, మధుసూదనాచారి, దేశపతి శ్రీనివాస్, తక్కెలపల్లి రవీందర్రావు, పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి నిరసనలో పాల్గొన్నారు.

## జీవో 317ను వెంటనే రద్దు చేయాలి

మొదటిపేజీ తరువాయి
ప్రస్తుత మంత్రివర్గంలో ఉన్న పలువురు నాయకులు గతంలో ఈ బాధితులకు న్యాయం చేస్తామని హామీలు ఇచ్చిన విషయాన్ని కవిత లేఖలో గుర్తు చేశారు. జీవో 317 వల్ల ఉద్యోగులు మానసిక క్షోభకు గురవుతున్నారని పేర్కొన్నారు. వెంటనే వన్ టైం రిలీఫ్ కింద ఉద్యోగులు, ఉపాధ్యాయులను స్థానికత ఆధారంగా స్వస్థలాలకు బదిలీ చేయాలని కోరారు. స్థానికతను గుర్తించే నిబంధనల్లో సమూల మార్పులు చేసి.. ఉద్యోగులకు సొంత జిల్లాల్లో పోస్టింగ్‌లు ఇవ్వాలని కవిత లేఖలో పేర్కొన్నారు. పీసీసీ అధ్యక్షుడి హోదాలో మీరు, ప్రస్తుత మీ మంత్రివర్గంలో ఉన్న పలువురు నాయకులు ప్రభుత్వ ఉద్యోగులను మానసిక క్షోభకు గురి చేస్తున్న జీవో నం.317 బాధితులకు న్యాయం చేస్తామని పలు సందర్భాల్లో హామీ ఇచ్చారని లేఖలో గుర్తు చేశారు. వెంటనే జీవో నం.317 బాధిత ఉద్యోగ, ఉపాధ్యాయులకు వన్ టైం రిలీఫ్ కింద వారి స్థానికత ఆధారంగా వారి స్వస్థలాలకు బదిలీ చేసేలా ఆదేశాలు జారీ చేయాలని కోరారు. అలాగే స్థానికతను గుర్తించే నిబంధనల్లోనూ సమూల మార్పులు చేయాలని డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్రంలో జిల్లాల పునర్వ్యవస్థీకరణ తర్వాత అప్పటికే వివిధ ఉమ్మడి జిల్లాల్లో పని చేస్తున్న ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులకు సీనియారిటీ ప్రాతిపాదికన కొత్త జిల్లాల్లో పోస్టింగ్స్ ఇచ్చారు. సీనియారిటీకి ప్రాధాన్యత ఇచ్చే క్రమంలో ఎనిమిదేళ్లు, అంతకన్నా తక్కువ సర్వీస్ ఉన్న ఉద్యోగులు, టీచర్లు ఆయా ఉమ్మడి జిల్లాల్లో కొత్తగా ఏర్పాటు చేసిన ఏదో ఒక జిల్లాకు అలాట్ అయ్యారు. ఇలా ఉద్యోగులను కొత్త జిల్లాల వారీగా సర్దుబాటు చేయడానికి జీవో నం.317 తీసుకు వచ్చారు. . 2021 డిసెంబర్ 6న అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం జారీ చేసిన జీవో నం.317 ద్వారా వేలాది మంది ఉద్యోగులు ఇబ్బంది పడుతున్నారని, వెంటనే ఆ జీవోను రద్దు చేసి ఉద్యోగులకు వారి సొంత జిల్లాల్లో పోస్టింగ్స్ ఇవ్వాలని కోరుతూ పీసీసీ అధ్యక్షుడి హోదాలో అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్‌కి మీరు లేఖ రాసిన విషయం గుర్తు ఉండి ఉంటుందని భావిస్తున్నాం. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో
కాంగ్రెస్ పార్టీని గెలిపిస్తే జీవో నం.317ను సమీక్షించి బాధిత ఉద్యోగులకు న్యాయం చేస్తామని మీరు హామీ ఇచ్చారు. జీవో నం.317 బాధితుల సమస్యలకు పరిష్కారం కనుగొనేందుకు అప్పటి సీఎస్ శాంతి కుమారి ఆధ్వర్యంలో సబ్ కమిటీని ఏర్పాటు చేశారు. కానీ ఇప్పటి వరకు ఆ సబ్ కమిటీ నివేదిక ఏమయ్యిందో అర్థం కాని పరిస్థితి. శాంతి కుమారి కమిటీ ఇచ్చిన నివేదిక బయట పెడితే తప్ప జీవో నం.317 బాధితులు ఎంతమంది అనే విషయంపై స్పష్టత వచ్చే అవకాశం లేదు. సబ్ కమిటీ తన నివేదిక సమర్పించి ఏళ్లు గడుస్తున్నా ప్రభుత్వం దానిని బయట పెట్టకపోవడంలో ఆంతర్యం ఏమిటో చెప్పాలని కవిత తెలిపారు.

# హైదరాబాద్,చెన్నైని మించి అమరావతి అభివృద్ధి

మొదటిపేజీ తరువాయి
కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత ఇంత భారీ మొత్తంలో గృహ ప్రవేశాలు చేయించడం ఇది రెండోసారి. మొదటి విడత కింద 12 నవంబర్ 2025న 3,00,192 ఇళ్లను పంపిణీ చేసింది. తాజాగా నేడు 1,00,875 టిడ్కో ఇళ్లతోపాటు మరో 1,50,018 ఇళ్లను మొత్తం 2,50,893 గృహాలను పేదలకు సీఎం చంద్రబాబు సర్కార్ అందించింది. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు భారీ బహిరంగ సభలో ప్రసంగించారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ..'మార్చి నెలలో మొన్ననే ఉగాది, నిన్న రంజాన్ జరుపుకున్నాం. ఇవాళ 2,50,893 మందికి ఇళ్ల పండుగ జరుపు కుంటున్నాం. ఇది ఒక చరిత్ర. మీ అందరిలో ఆనందం చూస్తుంటే, నా జన్మ ధన్యమైందని అనిపిస్తోందని అన్నారు. భవిష్యత్తులో మీకన్నీ శుభాలే జరగాలని, అంతా మంచే జరగాలని కోరుకుంటున్నా. ఒకప్పుడు గుడిసెల్లో ఉండేవారం. ప్రతి ఒక్కరికీ పక్కా ఇల్లు ఇవ్వాలని, పక్కా ఇళ్ల నిర్మాణాలకి యుగపురుషుడు ఎన్టీఆర్ శ్రీకారం చుట్టారు. ప్రతి ఒక్కరికీ ఇల్లు ఉండాలనేది టీడీపీ సిద్ధాంతం. ప్రతి ఒక్కరికీ ఇల్లు ఇచ్చే బాధ్యత నాదని హామీ ఇచ్చారు. గత వైసిపి ప్రభుత్వంలో వ్యవస్థలని అస్తవ్యస్తం చేశారు. అన్నింటినీ సరిచేస్తున్నాం. ధనికవర్గాలు ఉండే మాదిరిగా టిడ్కో ఇళ్లని నిర్మించిన ఘనత టీడీపీదే. మంచి ఇళ్లు కడితే పాడు చేశారు. పేదల పొట్ట కొట్టారు. ఈ ఏడాది చివరికి పది లక్షల ఇళ్లు ప్రజలకి అందివ్వడమే లక్ష్యం అన్నారు. గత ప్రభుత్వం ప్రజావేదిక విధ్వంసంతో మొదలెట్టి రాష్ట్రం మొత్తాన్ని విధ్వంసం చేసింది. ఎక్కడ చూసినా అవినీతి, అధికార దుర్వినియోగం. రూ.174కోట్లు లబ్దిదారులు కడితే వాటినీ మాయం చేశారు. 82 వేల కుటుంబాలకి ఆ డబ్బును అకౌంట్లలో వేస్తాం. కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన నిధులని దారి మళ్లించారు. నివాస యోగ్యంకాని స్థలాల్లో ఇళ్లు కట్టించారు. వైజాగ్‌లో ప్యాలెస్ నిర్మించుకున్నారు కానీ పేదలకి ఇళ్లు ఇవ్వడానికి మనసు రాలేదు. అంత పనికిమాలిన ప్రభుత్వాన్ని నేను నా జీవితంలో చూడలేదు. పేదలు ఉండాల్సింది మురికివాడల్లో కాదు. ఇలాంటి టిడ్కో ఇళ్లలో ఉండాలి. మీలో ఆశలు చిగురించాలి. ఇంటి జాగాలేని వారికి జాగా ఇస్తాం. బ్రహ్మాండంగా ఇళ్లు కట్టించి, పేదలకి ఒక ఆస్తి కల్పిస్తాం. ప్రతి ఇంటికీ అఔఉ కనెక్షన్ ఉండాలి. దానికి కూడా రాయితీ ఇస్తాం. ప్రతి ఇంటికీ మరుగుదొడ్డి ఉండాలి. ప్రతి ఇంటికీ తాగునీరు ఇవ్వాలని పథకం మొదలెడితే దాన్నీ పాడు చేశారు. ప్రతి ఒక్క కుటుంబానికి కుళాయి ద్వారా తాగునీరు అందిస్తాం. ప్రతి ఇంట్లో ఎక్కడికక్కడ విద్యుత్ తయారు చేసుకునే అవకాశం కల్పించాం. ఎస్సీలు, ఎస్టీలకి ఉచితంగా విద్యుత్ ఇస్తున్నాం. బీసీలకి రూ.20 వేలు రాయితీ ఇస్తున్నాం. సూపర్ సిక్స్ సూపర్ హిట్ చేశాం. ఈ ఏడాది 5 లక్షల మంది మహిళలని పారిశ్రామికవేత్తలని చేస్తాం. రాబోయే ఎన్నికల్లో మహిళలకి సీట్లు పెరగబోతున్నాయి. వైసీపీ పాలనలో పోలవరాన్ని నాశనం చేశారు. గోదావరి పుష్కరాలకంటే ముందుగానే పోలవరాన్ని పూర్తి చేస్తాం. ఏప్రిల్ నుంచి ఆకస్మిక తనిఖీలు చేస్తాం. బాగా పనిచేయని అధికారులను ప్రజల ముందే నిలదీస్తాం. ప్రజలు మెచ్చేలా నాయకులు, అధికారులు పనిచేయాలి. ఎమ్మెల్యేల పనితీరు బాగాలేకపోతే ఊరుకునేది లేదు. టెక్నాలజీ ఉపయోగించి సంక్షేమ పథకాల అమలు చేస్తున్నాం. పెన్షన్ల పంపిణీని రియల్‌టైమ్ మానిటర్ చేస్తున్నాం. బాగా పనిచేస్తున్న అధికారులను అభినందిస్తాం. పనిచేయని అధికారులతో పని చేయించడం మా బాధ్యతని అన్నారు.

## ఆహార కల్తీ నియంత్రణ సరికొత్త వ్యవస్థ

మొదటిపేజీ తరువాయి
తెలంగాణలో రాష్ట్రపతి పాలన పెడతామని ఆయన అంటున్నారని మండిపడ్డారు. మరి బీజేపీ పాలిత రాష్ట్రాల్లో పెట్టరా? అంటూ ప్రశ్నించారు. నియోజకవర్గాల పునర్విభజనను 50 శాతం సీట్ల ప్రాతిపదికన చేస్తే దక్షిణ భారతదేశానికి అన్యాయం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. బీజేపీ ఎంపీ లక్ష్మణ్ దీనిపై వితండవాదం చేస్తున్నారని ఆగ్రహించారు. 50 శాతం సీట్లు పెంచుతున్నామని చెప్పినా ఉత్తర భారతదేశానికి నేరుగా లాభం జరుగుతుందని ఆరోపించారు. యోజకవర్గాల పునర్విభజన జరిగితే సౌత్ ఇండియా అవసరం లేకుండా పోతుందని విమర్శించారు. ఇది పార్టీల సమస్య కాదని.. సౌత్ ఇండియా, ప్రజా సమస్యని చెప్పుకొచ్చారు. దక్షిణ భారత ప్రజల కోసం లక్ష్మణ్ రాజీనామా చేయాలని.. సౌత్, నార్త్ మధ్య అంతరం పెరగొద్దని హితవుపలికారు. తిరుగులేని పాలన వస్తే నియంతృత్వం వస్తుందని.. అది జరగటానికి వీల్లేదని తేల్చి చెప్పారు. దేశంలో బ్రూటల్ మెజార్టీ కోసం ప్రయత్నాలు జరుగుతున్నాయని.. బీజేపీ నాయకులు దీనిపై అవగాహన తెచ్చుకోవాలని హితవుపలికారు. బాగా పని చేస్తున్న సౌత్ ఇండియాను శిక్షించాలని చూస్తున్నారని మండిపడ్డారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ వల్లే తనకు గుర్తింపు వచ్చిందని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. కేసీఆర్ లేకపోతే తాను చేసిన మంచి పనులు ప్రజలకు తెలిసేవి కాదని చెప్పారు. రావణుడి చెడు వల్లే రాముడి గొప్పతనం తెలిసిందని చెప్పుకొచ్చారు. కేసీఆర్ విశ్రాంతి తీసుకొంటున్నారని అందరూ అంటున్నారని.. ఆయన్ను గృహ నిర్బంధం చేశారని తనకు అనుమానంగా ఉందన్నారు. రేపటి నుంచి రెండు రోజుల పాటు తాను కేరళలో ఎన్నికల ప్రచారం చేయనున్నట్లు తెలిపారు. తనకు, కేసీఆర్‌కు పోలిక లేదని.. ఎన్నికల వేళ తాము ఏం చెప్పామో అదే చేస్తున్నట్లు తేల్చి చెప్పారు. కేసీఆర్ చెప్పిన దానికి చేసిన దానికి సంబంధం లేదని.. ఆయన ఉండటం వల్లే తనకు పేరొచ్చిందని ఎద్దేవా చేశారు. అన్ని పథకాలు కలిపితేనే ప్రజాపాలన అని, రైతులకు అవగాహన కల్పించడంలో మీడియా కీలకపాత్ర పోషించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా మీడియా సామాజిక బాధ్యత తీసుకోవాలని సూచించారు. రూ.500ల గ్యాస్ విధానంలో ఎలాంటి మార్పులు లేవని గుడ్ న్యూస్ చెప్పారు. కేంద్రం సెస్ పేరుతో వసూలు చేస్తున్న డబ్బులు రాష్ట్రానికి ఇవ్వడం లేదని.. 34 శాతం మాత్రమే తిరిగి ఇస్తున్నారని మండిపడ్డారు. కేంద్రానికి నచ్చిన రాష్ట్రాలకు మాత్రమే సెస్ ఇస్తున్నారని ఆరోపించారు.

## పొంగులేటిని బర్తరఫ్ చేయండి

మొదటిపేజీ తరువాయి
ఈ అంశంపై గవర్నర్‌కు ఫిర్యాదు చేశామని.. స్వతంత్ర విచారణకు ఆదేశించాలని కోరినట్లు చెప్పారు. మంత్రి పొంగులేటిని బర్తరఫ్ చేయాలని గవర్నర్‌ను కోరామన్నారు. గవర్నర్ శివ ప్రతాప్ శుక్లాతో సోమవారం బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు భేటీ అయ్యారు. లోక్ భవన్‌కు వెళ్లిన బీఆర్ఎస్ బృందం మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మైనింగ్ అక్రమాలపై చర్యలు తీసుకోవాలని గవర్నర్‌కు వినతి పత్రం అందజేశారు. హైకోర్టు జడ్జితో విచారణ చేయించాలని విజ్ఞప్తి చేశారు. వేల కోట్ల ప్రజా సంపదను మంత్రి పొంగులేటి అక్రమ మైనింగ్ ద్వారా కొల్లగొడుతున్నారని బీఆర్ఎస్ శాసన సభా పక్ష బృందం ఆరోపించింది. ఈ సమావేశంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, బీఆర్ఎస్ ఎల్పీ డిప్యూటీ లీడర్ హరీష్ రావు, మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పాల్గొన్నారు. ఆదివారం కూడా మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మైనింగ్ వ్యవహారంపై అసెంబ్లీలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ఆందోళన చేసిన విషయం తెలిసిందే. మంత్రి పొంగులేటి రాఘవ కన్ స్ట్రక్షన్ ద్వారా అక్రమ మైనింగ్?కు పాల్పడుతూ ప్రభుత్వానికి ఆదాయానికి గండి కొడుతున్నారని బీఆర్ఎస్ ఆరోపించింది. రాఘవ కన్‌స్ట్రక్షన్స్ మైనింగ్‌పై వ్యవహారాలపై హౌస్ కమిటీ వేయాలని బీఆర్ఎస్ డిమాండ్ చేసింది. ఈ నేపథ్యంలో గత పదేండ్ల కాలంలో జరిగిన ప్రతి అక్రమ మైనింగ్‌పై పూర్తిస్థాయిలో సీబీ సీ-ఐడీ విచారణకు ఆదేశిస్తున్నట్టు అసెంబ్లీలో సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించారు.

## ద్రవ్యవినిమయ బిల్లుపై చర్చ..

మొదటిపేజీ తరువాయి
మంత్రులంతా గాలిమోటార్లలో గాలి తిరుగుడు తిరుగుతున్నారని వ్యాఖ్యానించారు. దీనిపై ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అభ్యంతరం వ్యక్తం చేశారు. వ్యాఖ్యలు విత్‌డ్రా చేసుకోవాలని డిమాండ్ చేశారు. హెలికాప్టర్‌లో తిరిగితే తెలంగాణలో గాలి తిరుగుడే అంటారని మహేశ్వర్‌రెడ్డి సమర్థించుకున్నారు. మహేశ్వర్‌రెడ్డి వ్యాఖ్యలను మంత్రి పొన్నం కూడా తీవ్రంగా ఖండించారు. హెలికాప్టర్‌లో తిరగడాన్ని గాలిమోటార్ అంటారు కానీ, గాలితిరుగుడు అనడం కరెక్ట్ కాదని, మహేశ్వర్‌రెడ్డి గౌరవప్రదంగా ఈ వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఇందులో అసలు తప్పేముందని మహేశ్వర్‌రెడ్డి మళ్లీ సమర్థించుకున్నారు.
మహేశ్వర్‌రెడ్డి వ్యాఖ్యలపై ప్రభుత్వ విప్ ఆదిశ్రీనివాస్ సీరియస్ అయ్యారు. స్పీకర్ కుర్చీని కించపరిచేలా మహేశ్వర్‌రెడ్డి మాట్లాడారని అన్నారు. " రైతులను మోసం చేసింది మీరు కాదా. రైతు వ్యతిరేక నల్లచట్టాలు తెచ్చింది మీరు. నాలుక కర్చుకొని మళ్లీ వెనక్కి తీసుకుంది కూడా మీరే. తప్పులన్నీ మీరు చేసి.. మమ్మల్ని నిందిస్తూ నోటికొచ్చినట్లు మాట్లాడటం సరికాదు" అంటూ వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. చివరకు స్పీకర్ సూచనతో.. తన వ్యాఖ్యలు తప్పుగా అర్థమైతే వెనక్కి తీసుకుంటాను అంటూ.. గందరగోళానికి మహేశ్వర్‌రెడ్డి తెరదించారు.

## ఆటో బోల్తా: తల్లీ కుమారుడు మృతి

కామారెడ్డి జిల్లా తాడ్వాయి మండల శివారులో ఘోర ప్రమాదం జరిగింది. ఆటో బోల్తాపడిన ఘటనలో తల్లీకుమారుడు మృతి చెందగా.. 11 మందికి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను కామారెడ్డి ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఓ వేడుకకు వెళ్తుండగా ఈ ఘటన జరిగినట్లు తెలుస్తోంది. ఈ ఘటనతో గ్రామంలో విషాదం అలముకుంది.

## లొంగిపోయిన మవోయిస్ట్ నారాయణరావు వారికి పరిహారం అందిస్తామన్న డిజిపి

- ఏపి నక్సల్స్ ఫ్రీ స్టేట్ అని ప్రకటన
- మావోయిస్ట్ ఉద్యమం క నుమరుగైందన్న నారాయణ

మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు చెన్నూరు నారాయణ రావు అలియాస్ సోమన్న ఏపీ డీజీపీ ముందు లొంగిపోయారు. దాదాపు 36 సంవత్సరాలుగా మావోయిస్టు పార్టీలో కీలక పాత్ర పోషించిన నారాయణ సహా మొత్తం 9 మంది సభ్యులు పోలీసుల ఎదుట లొంగి పోయారు. లొంగిపోయిన వారిలో ఏవోబీ స్పెషల్ జోనల్ కమిటీ, డివిజనల్, ఏరియా కమిటీలకు చెందిన మావోయిస్టులు ఉన్నారు. మావోయిస్టుల లొంగుబాటుపై ఏపీ డీజీపీ హరీశ్ కుమార్ గుప్తా వివరాలు వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్‌లో మావోయిస్టు కార్యకలాపాలు ముగింపు దశకు చేరుకున్నాయని, ఏపీ ఇప్పుడు నక్సల్స్ ఫ్రీ స్టేట్ అని డిజిపి అన్నారు. అందరి కృషితో ఇది సాధ్యమైంది. కాల్పులు కూడా జరిగాయి, లొంగుబాట్లు కూడా జరిగాయి. మా పిలుపునకు స్పందించి 9 మంది లొంగిపోయారు. లొంగిపోయిన వారికి ప్రభుత్వం తరఫున అన్ని రకాల సదుపాయాలు అందిస్తామని వెల్లడించారు. చెన్నూరు నారాయణకు ప్రభుత్వం నుంచి రూ.25 లక్షల ఆర్థిక సహాయం అందుతుంది. మిగతా వారికి 24.20 లక్షలు అందిస్తున్నాం' అని చెప్పారు. మావోయిస్టు అగ్రనేత గణపతి కార్యకలాపాలు కూడా రాష్ట్రంలో లేవని
తెలిపారు. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో శాంతి, భద్రతలు మరింత బలపడుతున్నాయని అధికారులు భావిస్తున్నారు. ఈ సందర్భంగా మావోయిస్టు నారాయణ మాట్లాడుతూ.. గతంలో పోలిస్తే ఇప్పుడు పరిస్థితులు పూర్తిగా మారాయని చెప్పారు. దేశంలో మావోయిస్టు ఉద్యమం ఇప్పుడు కనుమరుగయ్యే పరిస్థితి వచ్చిందన్నారు. సాయుధ పోరాటాన్ని వదిలి.. జనజీవన స్రవంతిలో కలిసిపోవాలని తాను లొంగిపోయినట్లు నారాయణ చెప్పుకొచ్చారు. 1990లో ఉద్దానంలో ప్రజా ఉద్యమానికి ఆకర్షితులు అయ్యాను. అప్పుడే మావోయిస్టు పార్టీలో చేరాను. పార్టీ తీర్మానాలకు అనుకూలంగా పనిచేశాను. శ్రీకాకుళం, విజయనగరం, విశాఖలో పనిచేశాను. నేను మావోయిస్టు ఉద్యమాల్లో చేరినపుడు పరిస్థితులు, ఇప్పుడు చాలా మారాయి. మేం పనిచేసిన ఆదివాసీ అటవీ ప్రాంతంలో అనేక మార్పులు వచ్చాయి. ప్రభుత్వం ఎన్నో సంక్షేమ కార్యక్రమాలు అందిస్తోంది. ఎప్పటికప్పుడు పరిస్థితులకు అనుగుణంగా పార్టీ అప్డేట్ కాకపోవటమే ఈ వైఫల్యానికి కారణం. వాస్తవ పరిస్థితులకు విరుద్ధంగా పార్టీ నిర్ణయాలు తీసుకోవటంతో ఈ పరిస్థితి వచ్చింది. మావోయిస్టు పార్టీ పరిస్థితులకు అనుగుణంగా అప్డేట్ అవలేదు, అందుకే ఏవోబీ సహా దేశ వ్యాప్తంగా పార్టీ కనుమరుగు అయింది' అని నారాయణ వివరించారు. 'సమాజంలో మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా పార్టీ సిద్ధాంతాలు మారలేదు. అందువల్లే పార్టీ ఇలా అయింది. పార్టీ హత్య చేసిన ఘటనల్లో నేను కూడా భాగస్వామి అయ్యాను. అయితే పార్టీ నిర్ణయాల్లో భాగంగా మాత్రమే అవి జరిగాయి. నాకు ఎవరితో వ్యక్తిగత విభేదాలు, శత్రువుత్వం లేదు. జరిగిన ఘటనకు నేను పశ్చాత్తాపపడుతున్నా' అని మావోయిస్టు నారాయణ చెప్పారు. నారాయణరావు స్వస్థలం శ్రీకాకుళం జిల్లా వజ్రపుకొత్తూరు మండలం బాతుపురం. ఆయన దాదాపు 35 ఏళ్లుగా అజ్ఞాతంలో ఉన్నారు. 1990లో పీపుల్స్ వార్‌లో చేరి అంచెలంచెలుగా ఎదిగారు. మిలిటరీ ఆపరేషన్స్‌లో దిట్ట అనే పేరు నారాయణకు ఉంది. ఏవోబీ స్పెషల్ జోనల్ కమిటీలో కీలకంగా వ్యవహరిస్తూ.. పార్టీ ఎదుగుదలకు కృషి చేశారు. ఏపీ, ఒడిశాల్లో అనేక కేసులు ఆయనపై ఉన్నాయి.

## మౌనిక హత్య కేసులో దర్యాప్తుముమ్మరం

- హత్యకు ముందే కత్తులు కొనుగోలు చేసిన రవీంద్ర
- డబ్బుల కోసం వేధింపులు తట్టకోలేక హత్య చేసినట్లు వెల్లడి

**విశాఖపట్టణం,మార్చి30**
విశాఖపట్నంలోని ఎల్.వి.నగర్‌లో దారుణ హత్యకు గురైన యువతి మౌనిక (29) కేసులో పోలీసుల దర్యాప్తు కొనసాగుతోంది. ప్రాథమిక విచారణలో కీలక విషయాలు వెలుగులోకి వచ్చాయి. లాక్‌డౌన్ సమయంలో నిందితుడు చింతాడ రవీంద్రకు డేటింగ్ యాప్‌లో మౌనిక పరిచయమైనట్లు తెలిసింది. ఆమెకు రూ.3.50లక్షల ఇచ్చినట్లు రవీంద్ర తెలిపాడు. డబ్బు కోసం మౌనిక వేధించేదని.. హింస భరించలేకే ఆమెను హతమార్చినట్లు పోలీసులకు చెప్పాడు. గాజువాక ప్రాంతంలో హృదయ విదారక ఘటన చోటుచేసుకుంది. ప్రేమ పేరుతో ఒక యువతిని హత్య చేసిన దారుణ ఘటన స్థానికంగా కలకలం రేపింది. గాజువాక 70వ వార్డు పరిధిలోని ఎల్‌బీ నగర్‌లో ఈ ఘటన జరిగింది. ఈ హత్యతో గాజువాక ప్రాంతంలో భయాందోళనలు నెలకొన్నాయి. పోలీసులు కేసు నమోదు చేసి.. నేవీ ఉద్యోగి అయిన ప్రియుడిని అదుపులోకి తీసుకున్నారు. పోలీసుల సమాచారం ప్రకారం శ్రీకాకుళం జిల్లా పాలకొండకు చెందిన నేవీ ఉద్యోగి రవీందర్ తన ప్రియురాలిని ఇంటికి పిలిపించి దారుణంగా హత్య చేశాడు. హత్య అనంతరం మృతదేహాన్ని ముక్కలు ముక్కలుగా నరికి.. కొంత భాగాన్ని ఫ్రిజ్‌లో, మరో భాగాన్ని గోనె సంచిలో దాచాడు. ప్రియురాలిని దారుణంగా హత్య చేసిన అనంతరం నిందితుడు స్వయంగా గాజువాక పోలీస్ స్టేషన్‌కు వెళ్లి లొంగిపోయాడు. దాంతో ఈ విషయం వెలుగులోకి వచ్చింది. రవీందర్ ఇంటికి వెళ్లిన పోలీసులు మృతదేహాన్ని స్వాదీనం చేసుకున్నారు. ఈ దారుణానికి కారణంగా కుటుంబ పరిస్థితులు, వ్యక్తిగత వివాదాలు ఉన్నాయనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. నిందితుడు రవీందర్ భార్య పుట్టింటికి వెళ్లిన సమయంలో ప్రియురాలిని ఇంటికి పిలిపించుకొని ఈ ఘాతుకానికి పాల్పడ్డాడని పోలీసులు ప్రాథమికంగా తెలిపారు. ప్రస్తుతం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు. ఆదివారం మధ్యాహ్నం ఒంటి గంటకు ఎల్.వి.నగర్‌లోని ఓ అపార్ట్‌మెంట్‌కు మౌనికను రవీంద్ర పిలిచాడు. అక్కడికి వచ్చిన కాసేపటికే వారిద్దరి మధ్య ఘర్షణ జరిగింది. ఆ తర్వాత ఆమెను రవీంద్ర కిరాతకంగా హతమార్చాడు. హత్యకు ముందే గాజువాకలో కత్తులు కొనుగోలు చేశాడు. మౌనికను చంపిన తర్వాత రక్తపు మరకలు కడిగేశాడు. రక్తపు వాసన రాకుండా ఇంట్లో సెంటు కొట్టాడు. శరీర భాగాలను ముక్కలుగా చేసి ఫ్రిజ్‌లో పెట్టాడు. తల, ఆమె ఫోన్‌ను దారపాలెం తోటల్లో తగులబెట్టాడు. అనంతరం స్నేహితుడికి ఫోన్ చేసి హత్య విషయాన్ని చెప్పాడు. స్నేహితుడు హెచ్చరించడంతో గాజువాక పోలీసులకు రవీంద్ర లొంగిపోయాడు.

# షెడ్యూల్ కులాల ఉపప్రణాళికలో జీరో టిల్లేజ్ మొక్కజొన్న సాగుపై శిక్షణ

**– రైతులకు ఉత్పాదకాల పంపిణీ, క్షేత్ర దినోత్సవం నిర్వహణ**

**కరపత్రం ప్రతినిధి జమ్మికుంట, మార్చి 30**
కరీంనగర్ జిల్లా జమ్మికుంట మండలం మడిపల్లి గ్రామంలోని రైతువేదికలో షెడ్యూల్ కులాల ఉపప్రణాళికలో భాగంగా జీరో టిల్లేజ్ మొక్కజొన్న సాగుపై శిక్షణా కార్యక్రమం, ప్రథమ శ్రేణి క్షేత్ర ప్రదర్శనల దినోత్సవం మరియు వ్యవసాయ ఉత్పాదకాల పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. వ్యవసాయ పరిశోధన స్థానం, కరీంనగర్, అఖిల భారత మొక్కజొన్న పరిశోధన కేంద్రం మరియు ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి భారీ సంఖ్యలో రైతులు హాజరయ్యారు.
ఈ సందర్భంగా వ్యవసాయ పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్త డా. బి. రాంప్రసాద్ మాట్లాడుతూ... జీరో టిల్లేజ్ విధానం ద్వారా




భూమి దున్నకుండానే పంటను సాగు చేయవచ్చని, దీని వలన ఖర్చులు తగ్గడంతో పాటు నేల ఉత్పాదకత పెరుగుతుందని వివరించారు. అలాగే మొక్కజొన్న పంటలో వచ్చే చీడపీడల నివారణకు అనుసరించాల్సిన సస్యరక్షణ పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించారు.
జిల్లా వ్యవసాయ అధికారి జె. భాగ్యలక్ష్మి మాట్లాడుతూ... వ్యవసాయ పరిశోధన స్థానం రైతులకు అందిస్తున్న సాంకేతిక సేవలు అభినందనీయమని పేర్కొన్నారు. రైతులు



మెరుగైన యాజమాన్య పద్ధతులు పాటిస్తూ అధిక దిగుబడులు సాధించాలని, పురుగుమందులను అవసరమైన పరిమితిలో మాత్రమే వినియోగించాలని సూచించారు.
కేవీకే జమ్మికుంటకు చెందిన డా. శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ... రైతులు పంట అవశేషాలను కాల్చివేయడం వల్ల నేలలోని జీవ పదార్థాలు నశిస్తాయని హెచ్చరించారు. కొత్తగా వస్తున్న చీడపీడలను సమగ్ర సస్యరక్షణ పద్ధతుల ద్వారా నియంత్రించాలని తెలిపారు. సహాయ సంచాలకురాలు సునీత మాట్లాడుతూ... పంటల




వైవిధ్యకరణ ప్రాముఖ్యతను వివరించారు. ఒకే పంటను వరుసగా సాగు చేయకుండా పంట మార్పిడి చేపట్టడం ద్వారా నేల సారాన్ని కాపాడుకోవచ్చని సూచించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాస్త్రవేత్తలు డా. జి. ఉషారాణి, డా. ఈ. ఉమారాణి యాసంగి మొక్కజొన్న రకాలు, విత్తనోత్పత్తి విధానాలు, అలాగే మొక్కజొన్నలో విలువ ఆధారిత ఉత్పత్తులపై రైతులకు సవివరంగా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా 50 మంది షెడ్యూల్ కులాల రైతులకు ఒక ఎకరాకు సరిపడా వ్యవసాయ ఉత్పాదకాలను పంపిణీ చేశారు. ఇందులో పురుగుమందులు కోరజెన్, కలుపు మందులు అట్రాజిన్, కాలరీస్ ఎక్స్‌ట్రా, జింక్ తదితరాలు ఉన్నాయి. ఈ పంపిణీ కార్యక్రమం రైతుల్లో ఆనందాన్ని కలిగించింది. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్, వ్యవసాయ పరిశోధన స్థానం ఏవో పద్మ, మడిపల్లి వ్యవసాయ విస్తరణ అధికారులు శ్రీ రాంప్రసాద్, సంపత్, కరీంనగర్ మరియు 108 మంది అభ్యుదయ రైతులు పాల్గొన్నారు. అనంతరం శాస్త్రవేత్తల బృందం మడిపల్లి గ్రామంలోని మొక్కజొన్న క్షేత్రాలను సందర్శించి, పంట పరిస్థితులను పరిశీలించి రైతులకు ప్రత్యక్షంగా సూచనలు అందించారు. రైతులకు ఉపయోగకరంగా మారిన కార్యక్రమం: ఈ శిక్షణా కార్యక్రమం ద్వారా రైతులకు ఆధునిక సాగు పద్ధతులపై అవగాహన పెరిగిందని, తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధించే దిశగా మార్గదర్శకత్వం లభించిందని రైతులు ఆనందం వ్యక్తం చేశారు.

## హౌసింగ్ బోర్డ్ కాలనీ డ్రైనేజీ సమస్యపై మున్సిపల్ అధికారుల పరిశీలన

**కరపత్రం ప్రతినిధి జమ్మికుంట మార్చి 30**
జమ్మికుంట పట్టణంలో వర్షాకాలం సమీపిస్తున్న నేపథ్యంలో వరదనీటి సమస్యలను ముందుగానే నివారించేందుకు మున్సిపల్ యంత్రాంగం చర్యలు ప్రారంభించింది. పట్టణంలోని హౌసింగ్ బోర్డ్ కాలనీ నుంచి వస్తున్న అండర్ డ్రైనేజీ సమస్యపై మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ (దిలీప్) స్వయంగా పరిశీలన నిర్వహించారు. ఇటీవలే వర్షాకాలంలో హౌసింగ్ బోర్డ్ కాలనీలో తలెత్తే వరద నీటి సమస్య తీవ్రతను దృష్టిలో ఉంచుకుని, చైర్మన్ డ్రైనేజీ లైన్లలోకి దిగి పరిస్థితిని సమీక్షించారు. ఈ క్రమంలో సోమవారం మున్సిపల్ అధికారులు టీపీవో శ్రీదర్, టీపీఎస్ రాజ్ కుమార్‌తో కలిసి మళ్లీ ప్రదేశాన్ని సందర్శించి సమస్యను సవివరంగా చర్చించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ, రానున్న వర్షాకాలంలో ప్రజలు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కోకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ముఖ్యంగా డ్రైనేజీ వ్యవస్థను విస్తరించి, అవసరమైన చోట కొత్త డ్రైన్లు నిర్మించాలని ఆదేశించారు. అలాగే నీరు నిల్వ ఉండే ప్రాంతాలను గుర్తించి, వెంటనే పరిష్కార చర్యలు చేపట్టాలని తెలిపారు. స్థానిక ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకొని వాటికి త్వరితగతిన పరిష్కారం చూపేందుకు మున్సిపల్ యంత్రాంగం కట్టుబడి ఉందని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల సిబ్బంది పాల్గొన్నారు.



## కొత్తపల్లి -- హనుమాన్ జంక్షన్ వద్ద రోడ్ సూచికకు అడ్డంగా ఫ్లెక్సీలు...
# వెంటనే తొలగించాలని ప్రజల డిమాండ్

**జమ్మికుంట, మార్చి 30 కరపత్రం ప్రతినిధి**
జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని కొత్తపల్లి-- ఇల్లందకుంట మూల వద్ద ఉన్న హనుమాన్ జంక్షన్ సమీపంలో ఏర్పాటు చేసిన ఆర్ అండ్ బి (=డీ) రోడ్ సూచిక బోర్డు స్పష్టంగా కనిపించకుండా దానికి అడ్డంగా భారీ ఫ్లెక్సీలు ఏర్పాటు చేయడం పట్ల స్థానిక ప్రజలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ప్రజల సౌకర్యార్థం, రహదారి మార్గదర్శకత్వం కోసం ఏర్పాటు చేసిన ఈ సూచిక బోర్డు ప్రస్తుతం పూర్తిగా కనిపించకుండా ఉండటం వల్ల వాహనదారులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.
ప్రత్యేకించి ఇతర ప్రాంతాల నుంచి వచ్చే ప్రయాణికులు, కొత్తగా ఈ మార్గంలో ప్రయాణించే వారు సరైన దారి తెలియక గందరగోళానికి గురవుతున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.
రాత్రి సమయాల్లో ఈ సమస్య మరింత తీవ్రమవుతుందని, సూచికలు కనిపించకపోవడం వల్ల ప్రమాదాలు సంభవించే అవకాశాలు కూడా




పెరుగుతున్నాయని వారు చెబుతున్నారు. రోడ్డు భద్రతకు అత్యంత ముఖ్యమైన సూచికలను ఈ విధంగా ఫ్లెక్సీలతో మూసివేయడం బాధ్యతారాహిత్యానికి నిదర్శనమని ప్రజలు విమర్శిస్తున్నారు. కొందరు వ్యక్తులు లేదా సంస్థలు అనుమతులు లేకుండా ఫ్లెక్సీలు ఏర్పాటు చేయడం వల్ల ప్రజా ప్రయోజనాలు దెబ్బతింటున్నాయని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇకపోతే, సంబంధిత మున్సిపల్ అధికారులు, రోడ్లు ఒ భవనాల శాఖ అధికారులు ఈ విషయంపై నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా పర్యవేక్షణను కట్టుదిట్టం చేయాలని వారు కోరుతున్నారు. ప్రజల డిమాండ్లు ఇలా ఉన్నాయి:
రోడ్ సూచిక బోర్డుకు అడ్డంగా ఉన్న ఫ్లెక్సీలను వెంటనే తొలగించాలి రహదారి సూచికలు స్పష్టంగా కనిపించేలా చర్యలు తీసుకోవాలి అనుమతి లేకుండా ఫ్లెక్సీలు ఏర్పాటు చేసే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు జరగకుండా పర్యవేక్షణ పెంచాలి ప్రజల భద్రత, ప్రయాణ సౌలభ్యం దృష్ట్యా అధికారులు తక్షణమే స్పందించి సమస్యను పరిష్కరించాలని కొత్తపల్లి ప్రజలు గట్టిగా డిమాండ్ చేస్తున్నారు.

## ఆరెగూడెం గ్రామ పంచాయతీలో మేకలతెబజార్ వేలం

**కరపత్రం ప్రతినిధి వెల్దుర్తి మాసాయిపేట మార్చి 30**
మెదక్ జిల్లావెల్దుర్తి మండలంలోని ఆరెగూడెంగ్రామంలో దైబజార్ వేలం పాట గ్రామ సర్పంచ్ చైతన్య హనుమంత్ రెడ్డి సమక్షంలో నిర్వహించారు గ్రామ సమీపంలో గత పాలకవర్గం మేకల సంతను ఏర్పాటు చేయగా ఆసంత లో దైబజార్ నిర్వహణకు వేలంపాటకు వేయగా గ్రామానికి చెందిన 615 00 వేలంపాటలో తై బజార్ను దక్కించుకున్నారు వేలంపాటలో ఇద్దరు పాల్గొనగా రూ 10,000 రూపాయలను ముందస్తుగాచెల్లించి వేలంపాటలో పాల్గొన్నారు ఎంపీ ఓ నవీన్ రెడ్డి పంచాయతీ సెక్రెటరీ పంచాయతి సెక్రటరీ అశోక్ కుమార్ మాజీ సర్పంచ్ పాల్వంచశేఖర్ ఉప సర్పంచ్ దుర్గయ్య పాలకవర్గ సభ్యులు గ్రామస్తులు పాల్గొన్నారు వెల్దుర్తి మండల కేంద్రంలోని ప్రతి శనివారం జరుగుతున్నటువంటి సందర్భంగా వెల్దుర్తి మండల పరిసర గ్రామాలలోని ఉన్నటువంటి మేకలను ప్రతి శనివారం వెల్దుర్తి మండలం ఆరెగూడెం గ్రామ శివారులోని మేకల సంతకు తీసుకు వస్తున్న ప్రతి ఒక్క మేకల యజమానులు ఆరెగూడెం గ్రామపంచాయతీలో ఉన్నటువంటి మేకల సంతలు దైబజార్ రూపాయలను కచ్చితంగా చెల్లించాలని వారు తెలియజేశారు



# డీటీఎఫ్ సదస్సును విజయవంతం చేయండి
## డిటీఎఫ్ జోన్ అధ్యక్షులు యేబూషి శ్రీనివాస్ పిలుపు

**కరపత్రం ప్రతినిధి జమ్మికుంట మార్చి 30**
కరీంనగర్ జిల్లా జమ్మికుంట పట్టణంలో ఈ నెల 31-03-2026న డెమొక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ (డీటీఎఫ్ ) జమ్మికుంట జోన్ ఆధ్వర్యంలో విస్తృత స్థాయి అవగాహన సదస్సును ఘనంగా నిర్వహించనున్నారు. ఉపాధ్యాయుల సమస్యలు, హక్కులు, విద్యా రంగ అభివృద్ధి దిశగా కీలక సూచనలు అందించే ఆకునూరి మురళి కమిషన్ నివేదికపై ఈ సదస్సు ప్రత్యేకంగా నిర్వహించబడుతోంది. జమ్మికుంట బాలుర ఉన్నత పాఠశాల ప్రాంగణంలో జరుగనున్న ఈ కార్యక్రమానికి జిల్లాలోని విద్యా వర్గాల్లో విస్తృత ఆసక్తి నెలకొంది.
ఈ సదస్సుకు డెమొక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి. లింగారెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షులు వి. రాజిరెడ్డి, రాష్ట్ర పూర్వాధ్యక్షులు ఎం. రఘు శంకర్ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై కమిషన్ నివేదికలోని ప్రధాన అంశాలను సమగ్రంగా వివరిస్తారు. ఉపాధ్యాయుల సేవా నిబంధనలు, బదిలీలు, పదోన్నతులు, వేతన వ్యవస్థ, పాఠశాలల మౌలిక వసతులు, విద్యార్థుల నాణ్యమైన విద్య వంటి అంశాలపై వారు సవివరంగా చర్చించి మార్గదర్శకత్వం



అందించనున్నారు.
ప్రస్తుత విద్యా వ్యవస్థలో ఎదురవుతున్న సవాళ్లు, ప్రభుత్వ విధానాల ప్రభావం, ఉపాధ్యాయుల పాత్ర, సమాజంలో విద్య ప్రాముఖ్యత వంటి అంశాలపై కూడా చర్చలు జరుగనున్నాయి. ఉపాధ్యాయ సంఘాల ఐక్యత, హక్కుల సాధనలో సంఘాల పాత్ర, భవిష్యత్ కార్యాచరణపై స్పష్టమైన దిశానిర్దేశం ఇవ్వడం ఈ సదస్సు ముఖ్య లక్ష్యంగా ఉంది.
ఈ సందర్భంగా డీటీఎఫ్ జిల్లా కార్యదర్శి మరియు జోన్ అధ్యక్షులు యేబూషి శ్రీనివాస్ మాట్లాడుతూ, జమ్మికుంట, ఇల్లంతకుంట, వీణవంక మండలాలకు చెందిన ప్రభుత్వ, ప్రైవేట్, పాఠశాలల ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో హాజరై సదస్సును విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఉపాధ్యాయుల సమస్యలను సమగ్రంగా చర్చించి పరిష్కార మార్గాలను అన్వేషించే వేదికగా ఈ సదస్సు ఉపయోగపడుతుందని ఆయన పేర్కొన్నారు.
సదస్సు విజయవంతం కావడానికి ముందస్తు ఏర్పాట్లు పూర్తి స్థాయిలో కొనసాగుతున్నాయి. పాల్గొనే ఉపాధ్యాయులకు సౌకర్యాలు, వేదిక అలంకరణ, సాంకేతిక ఏర్పాట్లు, పత్రాల పంపిణీ వంటి కార్యక్రమాలు వేగంగా సాగుతున్నాయి. స్థానిక డీటీఎఫ్ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పని చేస్తూ సదస్సును విజయవంతం చేయడానికి కృషి చేస్తున్నారు.
ఉపాధ్యాయుల భవిష్యత్‌కు మార్గదర్శకంగా నిలిచే ఈ అవగాహన సదస్సులో ప్రతి ఒక్కరూ తప్పక పాల్గొని తమ అభిప్రాయాలను వ్యక్తపరచాలని నిర్వాహకులు కోరుతున్నారు. విద్యా రంగ బలోపేతానికి, ఉపాధ్యాయుల హక్కుల పరిరక్షణకు ఈ సదస్సు ఒక కీలక మైలురాయిగా నిలవనుందని ఆశాభావం వ్యక్తమవుతోంది.

## నవనీత కృష్ణాలంకారంలో రాములవారు

**– స్వామిని దర్శించుకుని పులకించిన భక్తులు**
**– ఒంటిమిట్ట కళ్యాణానికి తిరుమల శ్రీవారి లడ్డూ**

ఒంటిమిట్ట శ్రీ కోదండరామస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా నాలుగో రోజు సోమవారం ఉదయం నవనీత కృష్ణాలంకారంలో రాములవారు ముగ్ధమనోహరంగా దర్శనమిచ్చారు. ఉదయం 7.30 గంటల నుండి స్వామివారి ఊరేగింపు వైభవంగా జరిగింది. కేరళ డ్రమ్స్, భక్తజన బృందాల చెక్కభజనలు, కోలాటాలతో స్వామివారిని కీర్తిస్తుండగా, మంగళవాయిద్యాల నడుమ స్వామివారి ఊరేగింపు కోలాహలంగా జరిగింది. భక్తులు అడుగడుగునా కర్పూరహారతులు సమర్పించి స్వామివారిని దర్శించుకున్నారు. పురాణాల ప్రకారం.. కృష్ణుడు వెన్నదొంగ. రేపల్లెలో బాలకృష్ణుడు యశోదమ్మ ఇంట్లోనే గాక అందరి ఇళ్లలోకి వెళ్లి వెన్న ఆరగించేవారు. ఈ చిన్నికృష్ణుడి లీలలను గుర్తు చేస్తూ రాములవారు వెన్నకుండతో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ ఈవో శ్రీమతి ప్రశాంతి, సూపరింటెండెంట్ శ్రీ హనుమంతయ్య, టెంపుల్ ఇన్స్పెక్టర్ శ్రీ నవీన్, విశేష సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఇదిలావుంటే ఏప్రిల్ 1వ తేదీన ఎంతో ప్రతిష్టాత్మకంగా ఒంటిమిట్టలో జరిగే శ్రీ సీతా రాముల కల్యాణానికి విచ్చేసే భక్తులకు అందించేందుకు 85 వేల తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదాలను సిద్ధం చేశారు. తిరుమలలోని శ్రీవారి సేవా సదన్ 1లో శ్రీవారి సేవకుల సహకారంతో లడ్డూల ప్యాకింగ్‌ను టీటీడీ ఒక బృహత్కార్యక్రమంగా నిర్వహించింది. ఈ లడ్డూల ప్యాకింగ్ కార్యక్రమంలో సుమారు 300 మంది శ్రీవారి సేవకులు అపార భక్తి, శ్రద్ధలతో పాల్గొన్నారు. తిరుమల ఎస్టేట్స్ అధికారి, డిప్యూటీ ఈవో వెంకటేశ్వరులు ఆధ్వర్యంలో లడ్డూ ప్యాకింగ్ నిరంతరాయంగా సాగింది. లడ్డూల ప్యాకింగ్, లోడింగ్, రవాణా వంటి అన్ని కార్యక్రమాలను విజయవంతంగా పూర్తి చేశారని అన్నారు.

## మోతుకులగూడెం గ్రామంలో శ్రీ భక్తాంజనేయ స్వామి శోభయాత్ర

**కరపత్రం ప్రతినిధి జమ్మికుంట మార్చి 30**
కరీంనగర్ జిల్లా జమ్మికుంట పట్టణంలోని మోత్కులగూడెం గ్రామం భక్తి భావంతో కళకళలాడింది. గ్రామంలోని శ్రీ భక్తాంజనేయ స్వామి ఆలయంలో ప్రతిష్ఠితమైన ఉత్సవమూర్తుల సన్నిధిలో 21 రోజుల పాటు మాలధారణ చేసిన భక్తులు, హనుమాన్ స్వాముల ఆధ్వర్యంలో నిర్వహించిన శోభాయాత్ర అపూర్వంగా, అద్భుతంగా జరిగింది. ఈ మహోత్సవం గ్రామ చరిత్రలో నిలిచిపోయే విధంగా ఘనంగా నిర్వహించబడింది. శోభాయాత్ర మోత్కులగూడెం చౌరస్తా నుండి ప్రారంభమై భూలక్ష్మి, మహాలక్ష్మి విగ్రహాల వరకు వైభవంగా సాగింది. మార్గమంతా పూలతో అలంకరించబడగా, విద్యుత్ దీపాలతో గ్రామం వెలుగులీనింది. భక్తులు జై శ్రీరామ్, జై హనుమాన్ నినాదాలతో ఆకాశాన్ని మారుమ్రోగించారు. మహిళలు



మంగళహారతులు పట్టి స్వామివారిని ఆహ్వానించగా, యువత డోలు వాయిద్యాలతో ఉత్సాహాన్ని నింపారు. పల్లకీ సేవలు, పుష్ప వర్షం, ధ్వజపతాకాలతో ఊరేగింపు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. చిన్నారుల నుంచి పెద్దల వరకు అందరూ సంప్రదాయ దుస్తుల్లో పాల్గొని ఆధ్యాత్మిక వాతావరణాన్ని మరింత గొప్పగా



తీర్చిదిద్దారు. భక్తులు భజనలు, కీర్తనలు చేస్తూ స్వామివారి కీర్తిని గానం చేయడం విశేషం. ఈ సందర్భంగా గ్రామ పెద్దలు మాట్లాడుతూ, ఇటువంటి కార్యక్రమాలు గ్రామ ఐక్యతకు ప్రతీకలని, యువతలో సంస్కృతి, సంప్రదాయాల పట్ల ఆసక్తి పెంపొందిస్తాయని పేర్కొన్నారు. కౌన్సిలర్లు, మాజీ ప్రజా ప్రతినిధులు, వివిధ సంఘాల నాయకులు పాల్గొని కార్యక్రమానికి మరింత గౌరవం తీసుకువచ్చారు. ఈ మహోత్సవంలో గ్రామ ప్రజలందరూ పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందారు. గ్రామంలో శాంతి, సౌభ్రాతృత్వం నెలకొనాలని, పాడిపంటలు పుష్కలంగా పండాలని, ప్రతి కుటుంబం సుఖసంతోషాలతో ఉండాలని ప్రార్థించారు. విద్య, వైద్యం, వ్యాపారం, ఉద్యోగాలు, రాజకీయ రంగాలలో గ్రామ యువత ఉన్నత శిఖరాలను అధిరోహించాలని కోరుకున్నారు. అంతేకాకుండా గ్రామ అభివృద్ధి కోసం అందరూ కలిసికట్టుగా పనిచేయాలని సంకల్పించారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలను మరింత విస్తృతంగా నిర్వహించాలని గ్రామ ప్రజలు నిర్ణయించారు. ఈ శోభాయాత్ర మోత్కులగూడెం గ్రామంలో భక్తి, ఐక్యత, ఆనందాన్ని నింపి ఒక పండుగ వాతావరణాన్ని సృష్టించింది. స్వామివారి కటాక్షంతో గ్రామం అన్ని రంగాలలో అభివృద్ధి చెందాలని, ప్రతి ఇంటా ఆనందం వెల్లివిరియాలని భక్తులు మనసారా కోరుకున్నారు.

కరపత్రం తెలుగు దిన పత్రిక

మంగళవారం మార్చి 31, 2026


# కోరపల్లి శివాలయంపై వివాదం రగులుతోంది...

## ఎండోమెంట్స్ ఆధ్వర్యంలో పారదర్శక కమిటీ కోరుతూ రాకేష్ డిమాండ్

**కరపత్రం ప్రతినిధి జమ్మికుంట, మార్చి 30**
కరీంనగర్ జిల్లా జమ్మికుంట మండలం కోరపల్లి గ్రామంలోని పురాతన శివాలయ నిర్వహణపై మరోసారి వివాదం చెలరేగింది. ఆలయాన్ని పూర్తిస్థాయిలో ఎండోమెంట్స్ శాఖ ఆధీనంలో కొనసాగిస్తూ, గ్రామ ప్రజల సమక్షంలో పారదర్శకంగా కొత్త కమిటీని ఏర్పాటు చేయాలని కోరుతూ గ్రామానికి చెందిన సామాజిక కార్యకర్త పింగిళి రాకేష్ తీవ్రంగా డిమాండ్ చేశారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... తాను కోరపల్లి గ్రామానికి చెందినవాడినని, గతంలో గ్రామ శివాలయంలో జరుగుతున్న అక్రమాలు, నిర్లక్ష్యం, ధూపదీప నైవేద్యాల లోపాలపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తూ 2017 అక్టోబర్ నెలలో 26 రోజులపాటు నిరాహార దీక్ష చేపట్టినట్లు తెలిపారు. ఆ దీక్షకు గ్రామస్థులు, భక్తులు, సామాజిక సంస్థలు పెద్దఎత్తున మద్దతు తెలిపినట్లు గుర్తుచేశారు.

తన దీక్ష ఫలితంగా ప్రభుత్వం స్పందించి, సంబంధిత అధికారులతో చర్చలు జరిపి 01-06-2022న దేవాదాయ శాఖ (ఎండోమెంట్స్) ఆధీనంలోకి శివాలయాన్ని తీసుకున్నట్లు


TELANGANA FISHERMAN CONGRESS
HYDERABAD
Pingili Rakesh Mudiraj
State Secretary
Date 30-3-26

వివరించారు. అప్పటి నుండి ఆలయానికి సంబంధించిన ధూపదీప నైవేద్యాలు క్రమబద్ధంగా నిర్వహించబడుతున్నాయని, అర్చకులకు ప్రభుత్వం ద్వారా జీతాలు కూడా అందుతున్నాయని తెలిపారు. అలాగే ఆలయానికి సంబంధించిన మాన్యం భూములు (సర్వే నంబర్లు 32, 19, 33, 37)పై కూడా ప్రభుత్వ పర్యవేక్షణ



ఉండేలా చర్యలు తీసుకున్నట్లు చెప్పారు.
అయితే ప్రస్తుతం పరిస్థితులు మళ్లీ పాత స్థితికి చేరుకుంటున్నాయనే ఆందోళన వ్యక్తం చేశారు. గ్రామ సర్పంచ్ కందికట్ల మధు మరియు పాలకవర్గం 27-03-2026న గ్రామ ప్రజలకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా, ఎండోమెంట్స్ నిబంధనలు పాటించకుండా తమకు అనుకూలంగా ఉన్న వ్యక్తులతో ఆలయ కమిటీని ఏర్పాటు చేసినట్లు ఆరోపించారు. ఆ కమిటీలో గ్రామపంచాయితీ సభ్యులు, ఉపసర్పంచ్, వార్డు సభ్యులు ముఖ్య పదవుల్లో ఉండటం వల్ల ఆలయ నిర్వహణలో రాజకీయ జోక్యం పెరిగే ప్రమాదం ఉందని పేర్కొన్నారు.

ఇంకా ఇటీవల శ్రీరామనవమి సందర్భంగా ఆలయంలో నిర్వహించిన శ్రీరామ కళ్యాణోత్సవంలో దేవాదాయ శాఖకు చెందిన అర్చకులను పక్కనపెట్టి, ఇతరులను తీసుకువచ్చి కార్యక్రమం నిర్వహించడం కూడా నిబంధనలకు విరుద్ధమని ఆయన విమర్శించారు. ఇది భక్తుల మనోభావాలను దెబ్బతీసే చర్యగా అభివర్ణించారు.

అలాగే ఆలయానికి సంబంధించిన ఆదాయం, ఖర్చుల విషయంలో పారదర్శకత లేకపోవడం, మాన్యం భూముల వినియోగంపై సరైన సమాచారం ప్రజలకు ఇవ్వకపోవడం వంటి అంశాలపై కూడా రాకేష్ ప్రశ్నలు లేవనెత్తారు. ఆలయ అభివృద్ధి పేరుతో కొందరు వ్యక్తులు స్వార్థ ప్రయోజనాలకు పాల్పడుతున్నారనే అనుమానం వ్యక్తం చేశారు.

ఈ నేపథ్యంలో వెంటనే ఎండోమెంట్స్ శాఖ అధికారులు జోక్యం చేసుకుని ప్రస్తుత కమిటీని రద్దు చేసి, గ్రామ ప్రజల సమక్షంలో నిబంధనలకు అనుగుణంగా కొత్త కమిటీని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఆలయానికి సంబంధించిన అన్ని వ్యవహారాలు దేవాదాయ శాఖ పర్యవేక్షణలో పారదర్శకంగా నిర్వహించాలని కోరారు.

అలాగే గ్రామ సర్పంచ్ మరియు పాలకవర్గం తీసుకున్న నిర్ణయాలపై విచారణ జరిపి, నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించిన వారిపై తగిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. ఇదిలా ఉండగా గ్రామంలోని పలువురు భక్తులు కూడా ఆలయ నిర్వహణలో పారదర్శకత అవసరమని అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఆలయం ఆధ్యాత్మిక కేంద్రంగా ఉండాల్సిందిపోయి వివాదాలకు కేంద్రంగా మారడం దురదృష్టకరమని పేర్కొంటున్నారు.

గ్రామ ప్రజల విజ్ఞప్తి:
ఆలయ పవిత్రతను కాపాడుతూ, రాజకీయ జోక్యాన్ని దూరం చేసి, భక్తుల విశ్వాసాన్ని నిలబెట్టే విధంగా అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలని కోరపల్లి గ్రామ ప్రజలు కోరుతున్నారు.

# జమ్మికుంటలో ప్రజావాణి కార్యక్రమం

## ప్రజల సమస్యలకు పరిష్కార దిశగా అధికారులు చర్యలు

**- భూమి సమస్యలే ఎక్కువగా వెల్లువెత్తిన వినతులు -**
**- త్వరితగతిన పరిష్కారానికి హామీ**

**కరపత్రం ప్రతినిధి జమ్మికుంట, మార్చి 30:**
ప్రజల సమస్యలను నేరుగా స్వీకరించి, వాటికి త్వరితగతిన పరిష్కారం చూపే లక్ష్యంతో జమ్మికుంట తహసిల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమం విజయవంతంగా కొనసాగింది. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ వెంకటరెడ్డి ముఖ్యంగా పాల్గొని ప్రజల నుండి వచ్చిన వినతులను స్వయంగా స్వీకరించి, వాటి పరిష్కారంపై సంబంధిత అధికారులకు తక్షణ ఆదేశాలు జారీ చేశారు.

ఈ సందర్భంగా తహసిల్దార్ వెంకటరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహిస్తోందని తెలిపారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను నేరుగా అధికారులకు తెలియజేసే వేదికగా ఈ కార్యక్రమం నిలుస్తోందని, ప్రజల సమస్యలను ఆలస్యం చేయకుండా పరిష్కరించడం తమ ప్రధాన బాధ్యత అని స్పష్టం చేశారు. ప్రతి దరఖాస్తును సమగ్రంగా పరిశీలించి, సంబంధిత శాఖలతో సమన్వయం చేసుకుని త్వరితగతిన పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ఈ కార్యక్రమానికి ఎంపీడీఓ, మున్సిపల్ కమిషనర్ ఎం.డి. ఆయాజ్, రెవెన్యూ సిబ్బంది, పంచాయతీ రాజ్ అధికారులు, మున్సిపల్ సిబ్బంది మరియు ఇతర శాఖల మండల స్థాయి అధికారులు హాజరయ్యారు. ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ సమస్యలను అధికారులకు వివరించారు. అధికారులు ప్రతి వినతిని



శ్రద్ధగా విని, వాటి స్వరూపాన్ని అర్థం చేసుకుని తగిన సూచనలు చేశారు.

ఈ సందర్భంగా మొత్తం 6 దరఖాస్తులు అందాయి. వాటిలో 5 దరఖాస్తులు భూమి సంబంధిత సమస్యలకు సంబంధించినవి కాగా, ఒక దరఖాస్తు రేషన్ కార్డు సమస్యకు సంబంధించినదిగా అధికారులు తెలిపారు. భూమి సమస్యలలో పహాణి నమోదు, పాస్‌బుక్ జారీ, సరిహద్దు వివాదాలు, వారసత్వ హక్కులు, రికార్డుల సవరణ వంటి అంశాలు ప్రధానంగా ఉన్నాయని వెల్లడించారు. రేషన్ కార్డు సమస్యకు సంబంధించి అర్హులైన వారికి సరైన విధంగా లబ్ధి చేకూరేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

భూమి సంబంధిత సమస్యలు ఎక్కువగా రావడం గమనార్హమని, వాటి పరిష్కారానికి ప్రత్యేక దృష్టి సారిస్తామని తహసిల్దార్ పేర్కొన్నారు. సంబంధిత రెవెన్యూ అధికారులు గ్రామ స్థాయిలో పర్యటించి సమస్యలను పరిశీలించి నివేదిక సమర్పించాలని ఆదేశించారు. అవసరమైతే ఫీల్డ్ ఇన్‌స్పెక్షన్ నిర్వహించి, వాస్తవ పరిస్థితులను తెలుసుకుని నిర్ణయం తీసుకుంటామని తెలిపారు.

అలాగే ప్రజావాణి ద్వారా వచ్చిన ప్రతి ఫిర్యాదును నమోదు చేసి, వాటి పరిష్కార స్థితిని నిరంతరం పర్యవేక్షిస్తామని అధికారులు తెలిపారు. సమస్యల పరిష్కారంలో ఆలస్యం జరగకుండా సంబంధిత శాఖల మధ్య సమన్వయం పెంచుతున్నామని పేర్కొన్నారు. ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా ఒకే వేదికలో సమస్యలను పరిష్కరించే దిశగా ఈ కార్యక్రమం ఎంతో ఉపయోగకరంగా ఉందని తెలిపారు.

ప్రజావాణి కార్యక్రమం ప్రతి వారం నిర్వహించబడుతుందని, ప్రజలు తమ సమస్యలను స్వయంగా వచ్చి అధికారులకు తెలియజేయాలని సూచించారు. ప్రజల సమస్యల పరిష్కారంలో పారదర్శకత, వేగం, సమర్థతకు ప్రాధాన్యం ఇస్తున్నామని తెలిపారు.

ప్రజల నుండి వచ్చిన వినతులను గౌరవంగా స్వీకరించి, వాటి పరిష్కారానికి కట్టుబడి పనిచేయాలని తహసిల్దార్ సంబంధిత అధికారులకు సూచించారు. ప్రజలకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని, ఎలాంటి నిర్లక్ష్యం సహించబోమని హెచ్చరించారు.

ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాల నుండి వచ్చిన ప్రజలు పాల్గొని తమ సమస్యలను వివరించారు. అధికారులు కూడా సహనంతో విని, తగిన మార్గదర్శకాలు అందించడం విశేషంగా నిలిచింది.

ప్రజావాణి కార్యక్రమం ప్రజల నమ్మకాన్ని పెంపొందించడంలో ముఖ్య పాత్ర పోషిస్తోందని స్థానికులు అభిప్రాయపడ్డారు. ఇలాంటి కార్యక్రమాలు మరింత సమర్థవంతంగా నిర్వహించాలని కోరారు.

# కౌశిక్ రెడ్డి ఇంటి పైన కోడి గుడ్లు, టమాటాల దాడి, దిష్టి బొమ్మ దగ్ధం చేసిన యూత్ కాంగ్రెస్

**కరపత్రం ప్రతినిధి హుజురాబాద్ మార్చి 30**
యూత్ కాంగ్రెస్ హుజురాబాద్ మండల అధ్యక్షులు పంజాల అరవింద్ గౌడ్ ఆధ్వర్యంలో యూత్ కాంగ్రెస్ నాయకులు హుజురాబాద్ శాసనసభ్యులు పాడి కౌశిక్ రెడ్డి ఇంటి పైన కోడి గుడ్లు, టమాటాలతో దాడి చేసి కౌశిక్ రెడ్డి దిష్టి బొమ్మ దగ్ధం చేసారు. కౌశిక్ రెడ్డికి వ్యతిరేకంగా నినాదలు చేసారు. అనంతరం యూత్ కాంగ్రెస్ అసెంబ్లీ అధ్యక్షులు చల్లూరి రాహుల్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు పంజాల అరవింద్ గౌడ్ మాట్లాడుతూ అసెంబ్లీ సమావేశలలో దళిత శాసనసభ్యులు కడియం శ్రీహరి పైన మాట్లాడిన





మాటలు వెనక్కు తీసుకొని బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. లేదంటే హుజురాబాద్ నియోజకవర్గం లో తిరగనివ్వమని హెచ్చరించారు. శాసనసభ సభ్యత్వం రద్దు అయ్యేవరకు మా యూత్ కాంగ్రెస్ పోరాటం కొనసాగిస్తాం అని అన్నారు. ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ నాయకులు టేకుల శ్రవణ్, అసెంబ్లీ ఉప అధ్యక్షులు బండ నవీన్, ప్రధాన కార్యదర్శి శనిగరపు తరుణ్, చిట్యాల రేవంత్, మండల ఉప అధ్యక్షులు మేకల రాజ్ కుమార్, చల్లూరి విష్ణు వర్ధన్ ప్రధాన కార్యదర్శి పంజాల రాజు గౌడ్, నాయకులు ఎండీ సాధిక్, జన్ను ప్రసాద్, బన్నీ తదితరులు పాల్గొన్నారు.

# వార్డు సభ్యులకు వేతనాలు ఇవ్వాలి .

**- తెలంగాణ వార్డు సభ్యుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు న్యాయవాది అతికం రాజశేఖర్ గౌడ్**

**కరపత్రం ప్రతినిధి కరీంనగర్ మార్చి 30**
కరీంనగర్ జిల్లా కేంద్రంలో ఉమ్మడి కరీంనగర్ జిల్లా వార్డు సభ్యుల ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన తెలంగాణ వార్డు సభ్యుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు అతికం రాజశేఖర్ గౌడ్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా గ్రామపంచాయతీ వార్డు సభ్యులకు వేతనాలు ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు .రాష్ట్రంలో ఉన్న గ్రామ పంచాయతీ వార్డు సభ్యులకు ప్రత్యేక ఇన్సూరెన్సులు కల్పించాలని గ్రామాల అభివృద్ధిలో నిరంతరం అనేక విధాలుగా తోడ్పాటు అందిస్తున్నారని తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో సర్పంచ్ లకు ఎంపీటీసీ, జడ్పిటిసి , కౌన్సిలర్, కార్పొరేటర్లకు వేతనాలు



అందిస్తున్నారు కానీ వార్డు సభ్యులకు అందించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వార్డు సభ్యుల ఆవేదనను అర్థం చేసుకొని వార్డు సభ్యులకు గౌరవ వేతనం ఇవ్వాలని పేర్కొన్నారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లా ముఖ్య కార్యకర్తల సమావేశంలో వివిధ నిర్ణయాలు భవిష్యత్తులో చేయబోయే కార్యచరణను గురించి చర్చించినట్లు తెలిపారు. భవిష్యత్తులో రాష్ట్రవ్యాప్తంగా తెలంగాణ గ్రామ పంచాయతీ వార్డు సభ్యులకు వేతనాలు ఇవ్వాలని, ఇన్సూరెన్స్ లు కల్పించాలని వార్డు సభ్యుల గౌరవాన్ని పెంచే విధంగా ప్రత్యేక హక్కులు కల్పించాలని కోరుతూ తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి, ప్రతిపక్ష నాయకులు, రాష్ట్ర మంత్రులను ,ఎమ్మెల్యేలను, వివిధ పార్టీల నాయకులను, కలసి వినతి పత్రాలు అందజేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కరీంనగర్ జిల్లా అధ్యక్షులు కరుణాకర్ గౌడ్, జగిత్యాల జిల్లా అధ్యక్షులు ఆకుల శ్రీదేవి, పెద్దపెల్లి జిల్లా అధ్యక్షులు నవీన్, రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షులు అమ్మిగల్ల గోపాల్, తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షులు చిలుముల నవీన్ కుమార్, రాష్ట్ర కార్యదర్శి చంద్రగిరి వెంకటేష్, రాష్ట్ర కోశాధికారి బత్తిని అనిల్ గౌడ్, అధికార ప్రతినిధి నాగుల సాంబయ్య గౌడ్, రాష్ట్ర ప్రముఖ సలహాదారు గడప కోటేష్ కుమార్, గౌరవ సలహా దారు కొలుగూరి సూర్య కిరణ్ ,కరీంనగర్ జిల్లా ఉపాధ్యక్షులు తిరుమల ,రాజన్న సిరిసిల్ల జిల్లా ఉపాధ్యక్షు లు గంగాధర వెంకటరమణ జమున తదితరులు పాల్గొన్నారు.

# వెల్దుర్తి సహకారస సంగం పురోగతికి సభ్యుల సహకారం ఎంతో అవసరం

## పర్సన్ ఇంచార్జ్ యాకుబ్ అలీ



**కరపత్రం ప్రతినిధి వెల్దుర్తి మాసాయిపేట మార్చి 30**
మెదక్ జిల్లా వెల్దుర్తి మండల కేంద్రంలోని సహకార సంఘా సభ్యుల సహకారం ఎంతో అవసరమని వెల్దుర్తి మండలం ప్రాథమిక సహకార సంఘం పర్సన్ ఇంచార్జ్ యాకూబ్ అలీ తెలిపారు సోమవారం వెల్దుర్తి పిఎసిఎస్ వార్షిక మహాజన సభ జరగగా సభ్యులను ఉద్దేశించి ఆయన మాట్లాడారు ఇప్పటివరకు 47 సార్లు పాలకవర్గం వార్షిక మహాసభలను నిర్వహించారని తాను పర్సన్ ఇన్చార్జిగా రెండోసారి సంగం పాలన వ్యవహారాల్లో పాల్గొని సమన్వయంతో పనిచేస్తున్నట్లు తెలిపారు సంఘంలోని 438 మంది సభ్యులకు 11.7 కోట్ల స్వల్పకాలిక రుణాలు 1.37 దీర్ఘకాలిక రుణాలు ఇచ్చినట్లు వారి తెలిపారు అలాగే సంఘం ద్వారా ఎరువులు విత్తనాలు ఆయా వ్యాపార సంస్థల నుండి కొనుగోలు చేసి విక్రయించమన్నారు అలాగే సంఘం ద్వారా 18 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటుచేసి 2025 26 లో రవి ఖరీఫ్ సీజన్లో 6540 మంది రైతుల వద్ద నుండి 31.13.751.60 క్వింటాళ్ల ధాన్యాన్ని కొనుగోలు చేసినట్లు ఆయన తెలిపారు ఈ కార్యక్రమంలో పాల్గొన్న తాజా మాజీచైర్మన్ చైర్మన్ తిరుమల అనంతరెడ్డి మాట్లాడుతూ సంఘం అభివృద్ధికి తన పదవీకాలంలో నాబార్డ్ ద్వారా కొన్ని కేంద్రాల వద్ద గోదాముల నిర్మాణానికి ప్రతిపాదనలు పంపగా అవి మంజూరు అయ్యాయని త్వరలో పనులను ప్రారంభించి రైతులకు అందుబాటులోకి ఉంచాలని వారు సూచించారు ఈ కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో సీఈవో అశోక్ సంఘ సభ్యులు తాజా మాజీ డైరెక్టర్లు పాల్గొన్నారు

# ప్రైవేట్ బస్సుల తనిఖీలు ముమ్మరం

## 976 ప్రైవేట్ ట్రావెల్స్ బస్సుల తనిఖీ

**- నిబంధనలు ఉల్లంఘించిన 193 బస్సులపై కేసులు**
**- ప్రయాణికుల భద్రత కోసమే అన్న మంత్రి రాంప్రసాద్**

**కరపత్రం ప్రతినిధి అమరావతి,మార్చి30:**
ఏపీలో రోడ్డు ప్రమాదాల నివారణెళి ధ్యేయంగా రవాణ శాఖ తనిఖీలను ముమ్మరం చేసింది. నిబంధనలకు విరుద్ధంగా.. ఓవర్ లోడ్‌తో నడుపుతున్న ప్రైవేట్ బస్సులపై కఠిన చర్యలు తీసుకోవాలని రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి అధికారులను ఆదేశించారు. మంత్రి ఆదేశాల మేరకు రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న టోల్ ప్లాజాలు, సరిహద్దు చెక్ పోస్టుల వద్ద రవాణా శాఖ అధికారులు ప్రత్యేక తనిఖీలు చేపట్టారు. ఒక్కరోజే రాష్ట్ర వ్యాప్తంగా మొత్తం 976 ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులను తనిఖీ చేసినట్లు అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా సరైన పత్రాలు లేకుండా నడుపుతున్న, నిబంధనలు ఉల్లంఘించిన 193 బస్సులపై కేసులు నమోదు చేసి, భారీగా జరిమానాలు విధించినట్లు అధికారులు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా 16 ప్రధాన పాయింట్లలో ఈ తనిఖీలు నిరంతరాయంగా కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రయాణికుల భద్రత విషయంలో ప్రభుత్వం రాజీ పడే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. కొంతమంది బస్సు యజమానులు ఇష్టానుసారంగా వాణిజ్య సరుకులను తరలిస్తూ.. అధిక లోడ్‌తో బస్సులను నడుపుతున్నారని చెప్పారు. భద్రతా నియమాలను ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రతి ఒక్కరూ విధిగా నిబంధనలను పాటించాలని చెప్పారు. ప్రయాణికుల క్షేమమే తమ ప్రభుత్వ మొదటి ప్రాధాన్యత అని మంత్రి పేర్కొన్నారు.